సాక్షి
రంగారెడ్డి
శనివారం ı 16 ı సెప్టెంబర్ ı 2023



నూరేళ్లు నిండాయా బిడ్డా..

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన యాచారం మండలం చింతుల్లలో చోటు చేసుకుంది. 10లో ▸



నిందితుడి అరెస్టు

ఇంటి తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 10లో ▸



దొంగల హల్‌చల్

నందిగామలో రోజురోజుకూ దొంగలు చెలరేగిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదయ్యాయి. 10లో ▸

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

షాద్‌నగర్: ఐటీఐలో ప్రవేశాల కోసం నాలుగో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షాద్‌నగర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు నాలుగో విడత విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఎస్‌ఎస్‌సీ మెమో, కులధ్రువీకరణ పత్రం, పదో తరగతి వరకు బోనఫైడ్, టీసీ, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

సబ్సిడీ గొర్రెలను సద్వినియోగం చేసుకోవాలి



సబ్సిడీ గొర్రెలను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప

షాబాద్: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గొర్రెలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప పేర్కొన్నారు. మండల పరిధిలోని బొబ్బిలిగామ, కొమరబండ గ్రామాల్లో రైతులకు అందించిన 30 యూనిట్ల సబ్సిడీ గొర్రెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం ఉంటుందన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అర్హులైన గొల్ల, కురుమలందరికీ సబ్సిడీ గొర్రెలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది శ్రీను, సాగర్, రైతులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లలో అవకతవకలకు తావీయొద్దు



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీయూపీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లలో ఎలాంటి అవకతకవకలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీరావు, జిల్లా నాయకుడు బొడ్డు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బదిలీల కోసం వైద్య ధ్రువపత్రాలను సమర్పించిన దరఖాస్తులను తిరిగి పరిశీలించాలని కోరారు. నకిలీ వైద్య పత్రాలను గుర్తించి వారిని జాబితా నుంచి తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పాస్ కేటగిరీలో 5 నుంచి 8 ఏళ్లు నిండకుండానే మళ్లీ దరఖాస్తు చేసుకున్న వాటిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేసినా వ్యక్తిగత బాధ్యత వహించేలా ఉపాధ్యాయుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. కేటగిరీ–1లో పని చేసి కేటగిరీ–3గా పని చేసినట్లు నమోదు చేసుకొని అదనపు పాయింట్లు పొందిన వారిని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.

రాష్ట్రపతి నిలయంలో ‘విమోచన’ వేడుకలు

రసూల్‌పురా: హైదరాబాద్ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17న పురస్కరించుకుని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మూడు రోజుల పాటు జరిగే సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, రంగస్థల, వ్యాసరచన, ముఖ చిత్రం, చిత్రలేఖనం ఖాదీ ఫ్యాషన్ షో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, మనూ వైస్ చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్య అతిథిగా హాజరై విమోచన దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి నిలయం మొత్తం కలియతిరిగారు. విమోచన దినోత్సవ కార్యక్రమాల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజల సందర్శనకు అనుమతించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ పాలనా వ్యవహారాల అధికారిణి రజనీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ‘డబుల్’

- అవినీతి, బంధుప్రీతికి ఆస్కారం లేదు
- ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణలు
- ఇల్లు దక్కని స్థానికులకు 75 గజాల స్థలం ఇస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి సబితారెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘చాంద్రాయణగుట్ట, యాకత్‌పుర, చార్మినార్, మలక్‌పేట్ నియోజకవర్గాల ప్రజల కోసం మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించాం. అక్కడ ప్రభుత్వ భూములు లేకపోవడంతో ఇక్కడ నిర్మించాల్సి వచ్చింది. భూములు స్థానికంగా ఉన్నవే అయినా..నిర్మాణానికి అయిన ఖర్చులు చెల్లించింది మాత్రం జీహెచ్‌ఎంసీనే. ఇందులో భాగంగా తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో రెండు చోట్ల 2,848 ఇళ్లు నిర్మిస్తే.. వీటిలో 1,718 హిందువులు..1,130 మైనార్టీలకు కేటాయించాం. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో 500 ఇళ్లు పంపిణీ చేస్తే వీరిలో 470 మంది హిందువులుంటే.. 30 మందే ముస్లింలు ఉన్నారు. మరో 600 ఇళ్లు స్థానికుల కోసం కేటాయించాం. త్వరలోనే వీటిని పంపిణీ చేస్తాం. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ అంశాన్ని బీజేపీ రాజకీయం చేస్తోంది. స్థానికేతరులకు ఇళ్లు పంపిణీ చేస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తూ..స్థానికంగా ఉన్న అమాయక పేదలను రెచ్చగొడుతున్నారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొడుతున్నారు’ అని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఇళ్లురాని వారికి ఇంటి స్థలాలు

డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కని అర్హులైన స్థానిక పేదలకు 75 గజాల చొప్పున ఇంటి స్థలాలను ఇవ్వనున్నటుమంత్రి తెలిపారు. మంకాల్, తుక్కుగూడ, రావిర్యాల, మన్సాన్‌పల్లి, మహేశ్వరంలో ఖాళీ ప్రభుత్వ భూములను గుర్తించి, పంపిణీకి సిద్ధం చేస్తున్నామని.. డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలాల విషయంలో పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పైరవీలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో మానవ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా అందరి సమక్షంలో డ్రా తీస్తున్నట్టు తెలిపారు.

అలాంటివారితో జాగ్రత్త

తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్రూం కేటాయింపుపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకే వర్గానికి కేటాయించారంటూ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవవటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేస్తూ, విషం చిమ్ముతున్న వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. వికారాబాద్ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ మెడికల్ కళాశాలలు ప్రారంభం కాబోతున్నట్టు చెప్పారు. జిల్లాకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి భగీరథ ప్రయత్నం చేశారని కొనియాడారు. శనివారం నిర్వహించే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. త్వరలోనే టెట్ ఫలితాలు వెల్లడించనున్నట్లు మంత్రి వివరించారు.

ఎత్తిపోతలతో జిల్లా సస్యశ్యామలం

పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెట్‌రన్‌ను శనివారం ప్రారంభిస్తున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల జలాలతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు సస్యశ్యామలం కానున్నాయని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు కృష్ణా జలాలతో పునీతం కానున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లావాసుల కలలను నిజం చేసిన ముఖ్యమంత్రికి రెండు జిల్లాల ప్రజలు రుణపడి ఉంటారన్నారు.



కనకదుర్గ అమ్మవారి ఆలయ నమూనాలో మండపం

‘బాలాపూర్’ వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు

- 18 ఫీట్ల ఎత్తుతో గణేశుడి విగ్రహం
- కనకదుర్గ ఆలయ నమూనాలో మండపం

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుని వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇక్కడ ఏటా గణేశుడి సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. స్వామివారి చేతిలోని లడ్డూకు ఎక్కడా లేని డిమాండ్ ఉంటుంది. ఈసారి ఐదు తలల నాగరాజు పడగల కింద స్వామివారిని సుందరంగా రూపొందించారు. విజయవాడ కనకదుర్గ ఆలయ నమూనాలో మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు. కోల్‌కతాకు చెందిన కళాకారులు 11 రోజులుగా ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. 18 ఫీట్ల ఎత్తుతో స్వామివారి విగ్రహాన్ని తయారు చేయించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ సమితి అధ్యక్షుడు క్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు.



బాలాపూర్ గణేశుడు

సమష్టి కృషితో అద్భుత ఫలితాలు



ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ సుపరిపాలన, స్థానిక సంస్థల సమష్టి కృషితో గ్రామీణాభివృద్ధిలో అద్భుత ఫలితాలు సిద్ధిస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సంవత్సరానికి గాను ఉత్తమ గ్రామాలకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలు, హరితహారం, ఇంటింటికీ శుద్ధ జలాలు అందుతున్నాయన్నారు. పల్లె ప్రగతితో గ్రామాల్లో సర్పంచ్‌లకు మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో తడి,పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, డెంగీ జ్వరాలు రాకుండా పారిశుద్ధ్యం పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి కాలుష్యం ఏర్పడకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయడం ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ గ్రామాలుగా ఎంపిక కావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లె ప్రగతిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ముఖ్యమంత్రి పర్మినెంట్ చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. 141 జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల వేళ జాగ్రత్తలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శాంతి సంఘం సమావేశాన్ని పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఈ ఏడాది గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఒకేరోజు ఉన్నందున అన్ని మతాల వారు ఐకమత్యంతో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు వలంటీర్లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అన్నారు. మండపాల వద్ద మద్యం తాగడడం, జూదం ఆడటం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల ఏర్పాటుకు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ బాక్సులు ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని, రాత్రి పది గంటలలోపు బంద్ చేయాలని సూచించారు. విద్యుత్ దీపాల అలంకరణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ తీగలు వేలాడకుండా, తెగిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. మండపాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఉత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు, నిఘా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నట్‌రాజన్, కమిషనర్ వెంకన్న, రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, ఎస్‌ఐలు దేవకి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రజాజీవనం శాంతియుతంగా ఉన్నప్పుడే పెద్దపెద్ద సంస్థలు, కంపెనీలు నెలకొల్పేందుకు ముందుకు వస్తాయన్నారు. పోలీస్ వ్యవస్థకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేసి సీఎం కేసీఆర్ అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, స్థానిక ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ గురునాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న సీపీ చౌహాన్

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

తుర్కయంజాల్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్ మాసబ్ చెరువును శుక్రవారం చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నగర శివారు ప్రాంతం కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి దానికి తగ్గ రీతిలో ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్, మున్సిపల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు భేష్

ఎన్‌ఐఆర్‌డీ బృందం కితాబు

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు బాగున్నాయని ఎన్‌ఐఆర్‌డీ బృందం కితాబిచ్చింది. మండలంలోని నాగన్‌పల్లిలో శుక్రవారం జాతీయ గ్రామీణ అభివృద్ధి శిక్షణ కేంద్రం నుంచి 9 మంది సీనియర్ అకౌంట్ అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ నిధులతో నిర్మించిన శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్టు యార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాయలం వద్ద ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామసభలో పాల్గొన్నారు. 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో కూలీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులపై సంతోషం వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడి పొదుపు, సూక్ష్మ రుణాల గురించి తెలుసుకున్నారు. లోన్ రికవరీ ఏవిధంగా చెల్లిస్తున్నారో సభలో చూశారు. ఈ కార్యక్రమంలో ఎంఓఆర్‌డీ నుంచి అనిల్‌కుమార్, రాజేష్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ ప్రోగ్రాం అధికారి నీరజ, అసిస్టెంట్ పడీడీ సక్రియ నాయక్, ఎంపీడీఓ వెంకటమ్మ, కోఆర్డినేటర్ శశిరేఖ,సామాజిక తనిఖీ మేనేజర్ అజయ్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌ముత్తయ్య, వెంకన్న, సర్పంచ్ జగన్, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్, ఉప సర్పంచ్ బీరప్ప, ఏపీఓ తిరుపతిచారీ, ఏపీఎం రవీందర్, ఈసీ అధిత్య, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, సంపత్‌లతో పాటు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

మీర్‌పేట: బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ‘ఇకనైనా తిరగబడదాం–తరిమికొడదాం’ కార్యక్రమాన్ని శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మందమల్లమ్మ చౌరస్తా నుంచి జిల్లెలగూడ వరకు పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ లోపాయకారి ఒప్పందంతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలపై ప్రతి ఒక్కరూ తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సామిడి గోపాల్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, మండల, డివిజన్ల, బ్లాక్, మున్సిపల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అయ్యప్పరెడ్డిగూడ చోరీ కేసులో..

• నిందితుడి అరెస్టు, నగదు రికవరీ

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని అయ్యారెడ్డిగూడ కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి నగదును దోచుకెళ్లిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిటెక్టివ్ సీఐ నాగరాజు తెలిపారు. శంకర్‌పల్లి పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ.. నవాబ్‌పేట్ మండలం గంగ్యాడ గ్రామానికి చెందిన అనిల్.. మంగళవారం సాయంత్రం అయ్యప్పరెడ్డిగూడ కాలనీలోని కటికె మహేశ్ ఇంటితాళం పగులగొట్టి బీర్వాలో ఉన్న రూ.23వేల నగదును దోచుకెళ్లడం జరిగిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాలనీలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డిటెక్టివ్ సీఐ నాగరాజు

అదుపుతప్పిన బైక్..

• వ్యక్తికి గాయాలు • ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు

ధారూరు: బైక్ అదుపుతప్పి కింద పడిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. అల్లిపూర్ గ్రామానికి చెందిన గోపాల్(42) శుక్రవారం పని నిమిత్తం బైక్‌పై వికారాబాద్ వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. బాచారం సమీపంలోకి రాగానే తాండూర్–వికారాబాద్ ప్రధాన రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడటంతో తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గోపాల్‌ను పీఎస్ వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి పంపిచారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోపాల్

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించండి

పోలీసు ఉన్నతాధికారులతో ఆర్డీఓ సమీక్ష

చేవెళ్ల: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి పరిధిలోని పోలీస్ అధికారులు, డివిజన్‌లోని తహసీల్దార్లతో ఎన్నికలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసుల సహకారం ఎంతో ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు లక్ష్మారెడ్డి, మహేశ్, యాదయ్య, ఎస్ఐలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నూరేళ్లు నిండాయా బిడ్డా..

• స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల చిన్నారి మృతి
• బస్సును అక్కడే వదిలి డ్రైవర్ పరార్
• చింతుల్లలో మిన్నంటిన రోదనలు
• కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన

యాచారం: అయ్యో దేవుడా...నా బిడ్డకు అప్పుడే నూరేళ్లు నిండాయా.. ఇంట్లో అల్లారుముద్దుగా తిరిగే బిడ్డ ఇక కనిపించదా అంటూ చిన్నారి మృతదేహం వద్ద తల్లిదండ్రులు రోదించిన తీరు చింతుల్ల గ్రామస్తులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చింతుల్ల గ్రామానికి చెందిన మేకల శివానంద్, జ్యోతి దంపతులకు తన్విక(5), చిన్నారి(2) ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కూతురు తన్విక ఇబ్రహీంపట్నంలోని టీఆర్ఆర్ స్కూలో ఎల్‌కేజీ చదువుతోంది. స్కూల్ బస్సులో నిత్యం పాఠశాలకు వెళ్లేది. రోజూ మాదిరిగానే శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి టీఆర్ఆర్ స్కూల్ బస్సు గ్రామానికి వచ్చింది. తన్వికను ఇంటికి తీసుకరావడానికి తల్లి జ్యోతితో పాటు చిన్నకూతురు చిన్నారి వెళ్లింది. ఈ క్రమంలో చిన్నారి ప్రమాదవశాత్తు అదే స్కూల్ బస్సు ఢీకొని తీవ్ర గాయాలపాలైంది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చిన్నారి మృతి చెందింది. ఐతే బస్సు డ్రైవర్ బస్సును అక్కడే వదిలి పారిపోయాడు.


చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మిన్నంటిన రోదనలు..

పాప మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. యాచారం సీఐ సైదయ్య అక్కడకు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చిన్నారి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌ను శిక్షించడంతో పాటు, కుటుంబ సభ్యులకు పరిహారం అందజేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీంతో స్కూల్ యజమాన్య ప్రతినిధులు గ్రామానికి వచ్చి గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు.

నందిగామలో దొంగల హల్‌చల్

• వారం వ్యవధిలో మూడు చోరీ కేసులు
• శుక్రవారం మహిళ మెడలో నుంచి చైన్ లాక్కెళ్లిన దుండగుడు

నందిగామ: నందిగామలో రోజురోజుకు దొంగలు చెలరేగిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఓ బోరుమోటార్ చోరీ, రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదవ్వడమే ఇందుకు ఉదాహరణ. నందిగామ ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. అప్పారెడ్డిగూడకు చెందిన చిన్నసాయి మంజుల శుక్రవారం మధ్యాహ్నం చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడ వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ.. దుండగుడు కొత్తూరు వైపునకు పారిపోయినట్లు సీసీ కెమెరాలో ఫుటేజీ లభ్యమైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. దుండగుడిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.


సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి ఫుటేజ్

మద్యం మత్తులో వాగ్వాదం

ఒకరి దారుణ హత్య

నందిగామ: పొట్టచేత పట్టుకొని వలస వచ్చిన ఓవ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని చాకలి గుట్ట తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపిన కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రం బక్సార్ జిల్లా బాషి గ్రామానికి చెందిన తున్‌తున్ చౌదరి(41) కొత్తూరులో నివాసం ఉంటూ మేకగూడ సమీపంలోని ఓ గోదాంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం బక్సార్ జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ్ బిందు, గుడియా దేవి భార్యభర్తలు చాకలిగుట్ట తండాలో నివాసం ఉంటూ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. తున్‌తున్ చౌదరి, అక్షయ్ బిందు దూరపు బంధువులు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తున్‌తున్ చౌదరి, అక్షయ్ బిందు ఇంటికి రాగా వారిద్దరితో పాటు గుడియా దేవి (మొత్తం ముగ్గురు) మద్యం సేవించారు. ఈ క్రమంలో ఆ ముగ్గురికి గొడవ చోటుచేసుకుంది. ఒకరికొకరు కొట్టుకోవడంతో తున్‌తున్ చౌదరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి షాద్‌నగర్‌లలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు అక్షయ్ బిందు, గుడియా దేవిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.


తున్‌తున్ చౌదరి (ఫైల్)

ప్లాట్ల విషయంలో ఘర్షణ

పలువురిపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్లాట్ల విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం పోలీస్ కేసుదాకా వెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాలు... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 5/అ లో గల ప్లాట్ నం.470, 471, 472ను సుర్మాయిగూడ గ్రామానికి చెందిన హుస్సేన్, కరిమెల శ్రీకాంత్.. కొనుగోలు చేసి అట్టి ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం కొంతమంది వ్యక్తులు అక్రమంగా వారి ప్లాట్లలోకి చొరబడి వాచ్‌మెన్ వెంకటేశ్‌ను బంధించి ఇంటి నిర్మాణానికి వాడుతున్న వస్తువులను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలంలో ఘర్షణ పడిన మొత్తం 19మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఇబ్రహీంపట్నం: గంజాయితో పట్టుబడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన రెడ్డిమల్ల భరత్(20).. గురువారం రాత్రి నగరంలోని ధూల్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసుకొనివస్తున్నాడు. ఇదే సమయంలో ఇబ్రహీంపట్నంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, పీసీ శేఖర్, హెచ్‌జీ శ్రీశైలం.. పాలిథిన్ కవర్‌లో గంజాయిని తీసుకొస్తున్న భరత్‌పై అనుమానంతో పట్టుకోడానికి ప్రయత్నించగా పరిపోయేందుకు యత్నించాడు. పోలీసులు భరత్‌ను పట్టుకోని అతని వద్ద నుంచి 200 గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

విజయభేరికి తరలిరండి

మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి

చేవెళ్ల: తుక్కుగూడలో ఆదివారం జరిగే కాంగ్రెస్‌పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్లలో శుక్రవారం నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. తుక్కుగూడ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకులు మధుసూదన్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: సెప్టెంబర్ 17న తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. సభకు నాయకులు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా రాయపోల్, ఖానాపూర్ గ్రామానికి చెందిన పలువురు మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: ప్రశంసాపత్రాలతో సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి


అబ్దుల్లాపూర్‌మెట్: అవార్డు అందుకుంటున్న మజీద్‌పూర్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి

‘స్వచ్ఛ’ అవార్డులు అందుకున్న సర్పంచ్‌లు

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు జిల్లా నుంచి పలు గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాలకవర్గం సభ్యులు, అధికారులు అవార్డులను అందుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


చేవెళ్ల: అవార్డు అందుకుంటున్న సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి నరేశ్‌గౌడ్


కొందుర్గు: అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ఆదిలక్ష్మి